
# సాక్షి
## అనంతపురం

బుధవారం । 30 । జూలై । 2025




### చీనీ టన్ను రూ.16 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.16 వేలు పలికాయి.



### టమాట కిలో రూ.44

అనంతపురం కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్ట ధర రూ.44 పలికింది. కనిష్టం రూ.30, సరాసరి రూ.37 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
**32.6°/ 22.8°**

జిల్లా అంతటా మంగళవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 15 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

## న్యూస్‌రీల్

### టీబీ డ్యాంకు కొనసాగుతున్న వరద



డ్యాం గేట్ల నుంచి నదికి పోతున్న నీరు

**బొమ్మనహాళ్:** టీబీ డ్యాంకు వరద చేరిక కొనసాగుతోంది. మంగళవారం ఇన్‌ఫ్లో 1,19,931 క్యూసెక్కులుగా నమోదైంది. వరద ఉధృతి పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో అప్రమత్తమైన టీబీ బోర్డు అధికారులు డ్యాం గేట్లన్నీ తెరిచి నీటిని నదికి వదులుతున్నారు. 13 క్రస్ట్ గేట్లు 5 అడుగులు, మిగిలిన 7 గేట్లు 4 అడుగుల మేర ఎత్తి 99,370 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రసుత్తం జలాశయంలో 1,633 అడుగులకు గాను 1,624.74 అడుగులకు నీరు చేరుకుంది. ఇన్‌ఫ్లో 1,19,931 క్యూసెక్కులు కాగా అవుట్‌ఫ్లో 1,09,189 క్యూసెక్కులుగా నమోదవుతోంది. జలాశయం మొత్తం నీటి సామర్థ్యం 105.788 టీఎంసీలు కాగా 75.640 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇదిలా ఉండగా ఆంధ్రా సరిహద్దులోని 105వ కిలోమీటర్ వద్ద హెచ్చెల్సీలో 1,200 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది.

### నేడు వైఎస్సార్‌సీపీ రాప్తాడు విస్తృత స్థాయి సమావేశం



**రాప్తాడురూరల్:** 'బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ' కార్యక్రమంలో భాగంగా బుధవారం రాప్తాడు నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. అనంతపురం నగరంలోని టీవీ టవర్ సమీపంలో ఎస్‌జేఆర్ ఫంక్షన్ హాలులో ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. నియోజకవర్గ పరిధిలోని వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

### కళ్యాణదుర్గం ఇన్‌చార్జ్ ఎస్‌ఆర్‌గా మురళీకృష్ణ

**అనంతపురం టౌన్:** కళ్యాణదుర్గం రిజిస్ట్రార్ కార్యాలయ ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్ (ఎస్‌ఆర్)గా మురళీకృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసినట్లు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ విజయలక్ష్మి మంగళవారం తెలిపారు. కళ్యాణదుర్గం ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్ నారాయణస్వామి ఇటీవల లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో శ్రీ సత్యసాయి జిల్లా డీఆర్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న మురళీ కృష్ణను కళ్యాణదుర్గం ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్‌గా నియమించారు.

# పురిట్లోనే 'పిండం'!



**ఉమ్మడి జిల్లాలో విచ్చలవిడిగా అబార్షన్లు**

- ఏటా 9 వేలకు పైగా జరుగుతున్నట్లు ఆరోపణలు
- 80 శాతం అబార్షన్లు ప్రైవేటు ఆస్పత్రుల్లోనే
- ప్రైవేటు నర్సింగ్ హోంలలో ఇష్టారాజ్యం
- ఐదోనెల గర్భం దాటినా అబార్షన్ చేస్తున్న వైనం

**డయాగ్నస్టిక్స్ సెంటర్లపై చర్యలిలా**

- లింగ నిర్ధారణ జరిగినట్లు తేలితే మూడేళ్ల జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా.
- వైద్యపరీక్షలు నిర్వహించిన డాక్టరు రిజిస్ట్రేషన్ రద్దు లేదా సస్పెండ్ చేస్తారు.
- లింగ నిర్ధారణ చేశారని తెలిసి, అబార్షన్ చేసిన గైనకాలజిస్ట్‌కు బెయిలు లేని మూడేళ్ల జైలు.
- డయాగ్నస్టిక్ సెంటర్‌ను మూసేయడంతో పాటు రిజిస్ట్రేషన్ రద్దు చేస్తారు.
- బాధ్యులైన వైద్యులపై క్రిమినల్ కేసు నమోదు చేస్తారు.

**సాక్షి ప్రతినిధి, అనంతపురం:** ఉమ్మడి అనంతపురం జిల్లాలో అబార్షన్లు విచ్చలవిడిగా జరుగుతున్నాయి. చిన్న చిన్న కారణాలకూ అబార్షన్ చేయడం సర్వసాధారణమైపోయింది. చట్టాలు కఠినంగా ఉన్నా లింగనిర్ధారణ చేయిస్తూ కడుపులోని బిడ్డ బాలిక అని తెలియగానే పురిట్లోనే 'పిండం' పెడుతున్న దుస్థితి నెలకొంది. అత్యంత పకడ్బందీగా, గుట్టుగా భ్రూణ హత్యలు జరుగుతున్నట్టు తెలుస్తోంది. పీసీపీఎన్‌డీటీ (ప్రీ కన్సెప్షన్ అండ్ ప్రినేటల్ డయాగ్నస్టిక్స్ టెక్నిక్స్) చట్టం ఉన్నా.. అమలు, పర్యవేక్షణ సరిగా లేకపోవడం అనధికారిక అబార్షన్లకు కారణమని తెలుస్తోంది. డయాగ్నస్టిక్స్ సెంటర్లతో వైద్యాధికారులు కుమ్మక్కై, తనిఖీలు చేయడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**వ్యాపారంలా..**

జిల్లాలో రేడియో డయాగ్నస్టిక్స్ సెంటర్లలో యథేచ్ఛగా లింగనిర్ధారణ జరుగుతున్నట్టు సమాచారం. గైనకాలజిస్టులు, రేడియాలజిస్టులు కలిసి వ్యాపారంగా చేస్తున్నట్లు తెలుస్తోంది. చట్టం కఠినంగా ఉన్నా అమలు సరిగా లేని కారణంగా కొన్ని ప్రైవేటు డయాగ్నస్టిక్స్ సెంటర్లు ఏ మాత్రం భయపడకుండా అక్రమ వ్యాపారం చేస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో ఏటా 65వేల మందికి పైగా గర్భం దాలుస్తున్నారు. అందులో రకరకాల కారణాల వల్ల 9 వేల వరకూ అబార్షన్లు జరుగుతున్నట్టు అంచనా.

**తల్లికి ప్రాణాపాయం ఉంటేనే..**

కడుపులో ఉన్న బిడ్డ వల్ల తల్లికి ప్రాణాపాయం ఉందని భావిస్తేనే అబార్షన్ చేయాలి. అదికూడా గర్భం ధరించిన 5 నెలల్లోనే చేయాలని చట్టం చెబుతోంది. కానీ చాలామంది ఐదో నెల దాటినా అబార్షన్ చేయించుకుంటున్నారు. బిడ్డ ఎదుగుదల సరిగా లేదనో, మరేవో కారణాలతో ఆరో నెలలో కూడా అబార్షన్లు చేస్తున్నట్టు తెలుస్తోంది. ఇలాంటి అబార్షన్‌కు రూ.15 వేలకు పైగా తీసుకుంటున్నట్టు తెలిసింది. ప్రతి అబార్షన్‌ను ఎందుకు చేశామన్నది వైద్య ఆరోగ్యశాఖకు వివరాలు ఇవ్వాలి. కానీ అలా చేస్తున్న నర్సింగ్‌హోం జిల్లాలో ఒక్కటీ లేదు.

**ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం**



అబార్షన్ కారణంగా తల్లి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుంది. ముందస్తు ప్రణాళిక లేకుండా అబార్షన్ చేయించుకుంటే రక్తహీనత ఏర్పడి ప్రాణం మీదకు వస్తుంది. ఇన్‌ఫెక్షన్లు సోకే అవకాశమూ లేకపోలేదు. భవిష్యత్తులో మళ్లీ ప్రెగ్నెన్సీ వచ్చినా గర్భసంచి, ట్యూబ్స్, అండాశయానికి ఇన్‌ఫెక్షన్లు వచ్చి అబార్షన్ అయ్యే అవకాశం ఉంది. అర్ధంతరంగా అబార్షన్ చేయించుకుంటే మళ్లీ గర్భం దాల్చే అవకాశాలు తక్కువవుతాయి.

– డాక్టర్ షంషాద్‌బేగం, గైనిక్ విభాగం హెచ్‌ఓడీ, అనంతపురం సర్వజనాస్పత్రి

**ఉమ్మడి అనంతపురం జిల్లాలో 2024-25 సంవత్సరం గణాంకాలు..**

| | |
|---|---|
| అనంతపురం జిల్లాలో గర్భిణుల రిజిస్ట్రేషన్ | 37,167 |
| ఏటా జరుగుతున్న అబార్షన్లు (సగటున) | 5,575 |
| శ్రీ సత్యసాయి జిల్లాలో గర్భిణుల రిజిస్ట్రేషన్ | 27,964 |
| ఏటా జరుగుతున్న అబార్షన్లు (సగటున) | 4,194 |

### మళ్లీ బురిడీ కొట్టించేందుకు వచ్చి.. కాళ్లకు బుద్ధిచెప్పి!



బైకును వదిలి పరుగు తీస్తున్న దృశ్యం

**పామిడి:** రైతు సభ్యత్వ కార్డు పేరుతో మరోసారి బురిడీ కొట్టించేందుకు వచ్చిన ఇద్దరు మోసగాళ్లు.. స్థానికులు తిరగబడడంతో కాళ్లకు బుద్ధి చెప్పారు. వివరాలు.. ప్రధాని మోదీ స్కీమ్ పేరుతో కేంద్ర ప్రభుత్వం బ్యాంకు రుణాలు మంజూరు చేస్తోందని, ఇందుకు రైతు సభ్యత్వ కార్డు తీసుకోవాలంటూ ఐదు రోజుల క్రితం ఇద్దరు వ్యక్తులు (వీరిలో ఒకరు మహిళ) పామిడి పంచాయతీలోని మజారా గ్రామమైన పి.కొత్తపల్లికి చేరుకుని రైతులతో సమావేశమై మాట్లాడారు. ప్రధాని స్కీమ్ అంటూ నమ్మబలకడంతో దాదాపు 500 మంది రైతులు ఒక్కొక్కరు రూ.200 చొప్పున చెల్లించి సభ్యత్వ కార్డులు పొందారు. తమ ఆధార్ కార్డు నంబర్, బ్యాంక్ ఖాతాకు అనుసంధానమైన సెల్‌ఫోన్ నంబర్ అందజేశారు. ఈ క్రమంలోనే గ్రామానికి చెందిన ఓ రైతు అనుమానం వచ్చి నిలదీయగా మోసగాళ్లు ద్విచక్ర వాహనంపై ఉడాయించారు. ఇదే క్రమంలో మళ్లీ మంగళవారం మండలంలోని పీ కొత్తపల్లి గ్రామానికి మోసగాళ్లు రావడం గమనార్హం. అయితే, కంత్రీగాళ్లపై స్థానికులు తిరగబడడంతో భయాందోళనకు గురైన వారు తమ ద్విచక్రవాహనాన్ని అక్కడే వదిలేసి పరుగు లంకించారు. జనం అమాయకత్వాన్ని సొమ్ము చేసుకోవాలని యత్నిస్తున్న ఇలాంటి వారికి అధికారులు, పోలీసులు తగిన బుద్ధి చెప్పాలని మండలవాసులు కోరుతున్నారు.

### జర్మన్ భాషపై శిక్షణ

**అనంతపురం రూరల్:** నర్సింగ్ పూర్తి చేసిన గిరిజన విద్యార్థినులకు ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో జర్మన్ భాషపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి శ్రీనివాసరావు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అర్హులైన గిరిజన విద్యార్థినులు https://naipunyam.ap.gov.in వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ఎంపికైన వారికి రాష్ట్రంలోని మూడు ప్రాంతాల్లో 8 నుంచి 10 నెలల పాటు జర్మనీ భాషపై శిక్షణ ఇస్తారు.

# 20 వేల మందికి 'సుఖీభవ' లేనట్లే!

**అనంతపురం అగ్రికల్చర్:** మొదటి ఏడాది 'అన్నదాత సుఖీభవ' కింద పెట్టుబడి సాయం ఎగ్గొట్టిన చంద్రబాబు సర్కారు కనీసం రెండో ఏడాదైనా అందిస్తారని భావించిన రైతులకు నిరాశ ఎదురవుతోంది. మే నుంచి జూలై వరకు తేదీల మీద తేదీలు ప్రకటించినా ఆచరణకు నోచుకోని పరిస్థితి నెలకొంది. తాజాగా ఆగస్టు 2న పీఎం కిసాన్‌తో పాటు 'అన్నదాత సుఖీభవ' సొమ్ము ఇస్తామని చెబుతున్నారు.

**రకరకాలుగా కొర్రీలు..**

కూటమి అధికారంలోకి వచ్చి 14 నెలలు కావొస్తున్నా రైతులకు చేసింది శూన్యమనే చెప్పాలి. ఏటా రూ.20 వేలు ఇస్తామని ఘనంగా ప్రకటించిన చంద్రబాబు... మొదటి ఏడాది పైసా ఇవ్వకుండా దాటేశారు. పీఎం కిసాన్ కింద ఇచ్చే రూ.6 వేలతో కలిపి రాష్ట్ర ప్రభుత్వం వాటా కింద రూ.14 వేలు మూడు విడతల్లో ఇస్తామని ప్రకటించారు. పీఎం కిసాన్ కింద గతేడాది మూడు విడతల్లో రూ.6 వేలు ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ.14 వేల ప్రకారం ఇవ్వకపోవడంతో జిల్లా రైతులు రూ.400 కోట్ల పైచిలుకు కోల్పోయారు. ఏడాదిగా జాబితాల మీద జాబితాలు సిద్ధం చేస్తున్నా కొలిక్కి రావడం లేదు. ప్రస్తుతానికి 2,79,172 మందితో జాబితా తయారు చేసినా... అందులో 2,64,471 మందికే సొమ్ము జమయ్యేలా అర్హత జాబితా రెడీ చేసినట్లు అధికారులు తెలిపారు. మిగిలిన రైతులకు సంబంధించి ఈ-కేవైసీ, ఎన్‌పీసీఐ అంటూ కొర్రీలు వేస్తున్నట్లు తెలిసింది. ఎలా చూసినా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూపొందించిన జాబితాతో పోల్చుకుంటే 20 వేల మందికి పైగా 'సుఖీభవ' దక్కే పరిస్థితి లేదని చెబుతున్నారు. ఇక.. 2,68,950 మందితో పీఎం కిసాన్ జాబితా సిద్ధం చేశారు. ఇందులో కూడా గత వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన దానితో పోల్చుకుంటే 22 వేల మంది వరకు తగ్గినట్లు స్పష్టమవుతోంది. మొత్తమ్మీద పీఎం కిసాన్-అన్నదాత సుఖీభవ జాబితాలకు కొర్రీలు వేయడంతో వేలాది మంది రైతులకు సొమ్ము జమ అయ్యే పరిస్థితి కనిపించడం లేదు. ప్రస్తుతం పీఎం కిసాన్ కింద రూ.2 వేలు ఇస్తున్నా... రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే రూ.14 వేలలో విడతకు ఎంత ఇస్తారనేది ప్రకటించలేదు.

**గతంలో సకాలంలో..**

గత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో 2019-24 మధ్య ఐదేళ్లూ క్రమం తప్పకుండా పీఎం కిసాన్-వైఎస్సార్ రైతు భరోసా కింద రైతులకు పెట్టుబడి సాయం అందించారు. 2023-24 జనవరిలో జగన్ ప్రభుత్వం దిగిపోయే ముందు 2,91,334 మంది రైతులకు పీఎం కిసాన్ కింద సొమ్ము ఇచ్చారు. అలాగే వైఎస్సార్ రైతు భరోసా కింద 2,94,353 మందికి పెట్టుబడి సాయం అందించారు. జగన్ హయాంలో ఏటా రూ.13,500 ప్రకారం ఏకంగా రూ.1,937 కోట్ల పెట్టుబడి సాయం అందించడంతో రైతులు సంతోషంగా వ్యవసాయం చేశారు.

### 'నేమకల్లు ఆలయంలో లడ్డూ విక్రయాలకు అనుమతి లేదు'

**బొమ్మనహాళ్:** జిల్లాలోనే ప్రసిద్ధిగాంచిన నేమకల్లులోని ఆంజనేయస్వామి ఆలయంలో లడ్డూ ప్రసాద విక్రయాలకు అనుమతి లేదని దేవదాయశాఖ డీసీ గురుప్రసాద్, అనంతపురం ఏసీ తిరుమలరెడ్డి స్పష్టం చేశారు. ఆలయంలో లడ్డూ ప్రసాదంలో నాణ్యత లోపించడంపై ఈ నెల 27న 'లడ్డూలో నాణ్యత ఎంత?' శీర్షికన 'సాక్షి'లో కథనం వెలువడింది. దీంతో దేవదాయశాఖ అధికారులు మంగళవారం నేమకల్లు ఆంజనేయస్వామి ఆలయానికి చేరుకుని విచారణ చేపట్టారు. లడ్డూ ప్రసాదం తయారీ దేవదాయశాఖ ఆధీనంలో లేదని, ఆలయంలో విక్రయించడానికి అనుమతులు లేవని, ఎవరైనా విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ నరసింహారెడ్డి పాల్గొన్నారు.

# హవ్వా.. మరీ ఇంత బరితెగింపా!



కామారుపల్లి జగనన్న లేఅవుట్‌లో ధ్వంసమైన మట్టి రోడ్డు



జగనన్న కాలనీ నుంచి తరలించిన ఎర్రమట్టితో సమీపంలో ఉపాధి హామీ పథకం కింద కొత్తగా వేసిన రోడ్డు

- కామారుపల్లి జగనన్న కాలనీని చెరబట్టిన 'తమ్ముళ్లు'
- అంతర్గత రోడ్లలో పట్టపగలే మట్టి దొంగతనం

**రాప్తాడు రూరల్:** ఎక్కడైనా మట్టిరోడ్లు వేయాలంటే కొండ, గుట్టల నుంచి ఎర్రమట్టి తీసుకొస్తారు. అయితే అనంతపురం రూరల్ మండలానికి చెందిన కొందరు 'తెలుగు తమ్ముళ్లు' గతంలో వేసిన రోడ్లను చెరబట్టి అక్కడి మట్టిని తోలుతున్నారు. ఇంకా కొందరు మరింత బరి తెగించి ప్రైవేట్ స్థలాలకు మట్టిని తరలిస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు చోద్యం చూస్తుండడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**ఇదీ అసలు కథ..**

అనంతపురం నగరంలో ఇంటిస్థలాలు లేని నిరుపేదల కోసం గత ప్రభుత్వ హయాంలో అనంతపురం రూరల్ మండలం కామారుపల్లి పంచాయతీలో 160 ఎకరాల్లో జగనన్న లేఅవుట్ వేశారు. 7,384 మందికి ప్లాట్లు కేటాయించి పట్టాలిచ్చారు. కోట్లాది రూపాయలు ఖర్చు చేసి కాలనీని అభివృద్ధి చేశారు. రూ. 80 లక్షల నిధులతోమట్టిరోడ్లు వేశారు. ప్రతి ప్లాటుకు హద్దులు కేటాయిస్తూ రాళ్లు నాటారు.

**మట్టి కొట్టుకుపోతున్నారు..**

కూటమి ప్రభుత్వం వచ్చాక కామారుపల్లి జగనన్న కాలనీపై టీడీపీ నాయకులు కన్నేశారు. కాలనీ అంతర్గత రోడ్లను ధ్వంసం చేస్తున్నారు. ఎర్రమట్టిని ట్రాక్టర్లలో నింపుకుని బయట ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇప్పటికే 30 శాతం రోడ్లను ధ్వంసం చేశారు. కొందరు ప్రైవేట్ ప్లాట్లకు ఉపయోగించుకుంటుండగా, మరికొందరు ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న పనులకు వినియోగిస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి తోలుకోవాలంటే రవాణా ఖర్చు అవుతుందని జగనన్న లేఅవుట్‌లోని రోడ్లను చిదిమేస్తున్నారు. రూరల్ మండలంలోని కామారుపల్లి, చిన్నంపల్లి, సజ్జకాలువ తదితర గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న రోడ్లకు ఇదే మట్టిని తోలుకున్నట్లు తెలిసింది. అలాగే ప్లాట్లకు హద్దులు కేటాయిస్తూ నాటిన రాళ్లను సైతం ఎత్తుకెళ్లారు. ఇప్పటికే 30 శాతం పైగా రాళ్లు చోరీకి గురయ్యాయి.

**పట్టపగలే బరి తెగింపు...**

కామారుపల్లి జగనన్న లేఅవుట్ నుంచి పట్టపగలే బరి తెగించి ట్రాక్టర్లలో మట్టి తరలిస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు తమకేమీ తెలియనట్లు ఉంటున్నారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకోకపోతే 'తమ్ముళ్ల' ధనదాహానికి ఉన్న రోడ్లన్నీ కర్పూర హారతిలా కరిగిపోనున్నాయి. నియోజకవర్గానికి చెందిన ముఖ్య ప్రజాప్రతినిధి, వారి కుటుంబ సభ్యుల పేర్లు చెప్పుకుంటూ కొందరు సాగిస్తున్న దందాపై సామాన్య ప్రజలతో పాటు టీడీపీ కార్యకర్తలూ మండిపడుతున్నారు.

### మిర్చి రైతులకు రూ.2 కోట్లకుపైగా కుచ్చుటోపీ



పోలీసుస్టేషన్‌లో బాధిత రైతులు

**బొమ్మనహాళ్:** మిర్చి రైతులకు ఓ వ్యాపారి రూ.2 కోట్లకుపైగా కుచ్చుటోపీ పెట్టాడు. చెమటోడ్చి పండించిన పంటను వ్యాపారి చేతిలో పెడితే డబ్బు ఇవ్వకుండా మోసం చేస్తున్నాడంటూ బాధితులు వాపోతున్నారు. వివరాలు.. బొమ్మనహాళ్ మండలంలోని గోవిందవాడ, దేవగిరి గ్రామాలకు చెందిన రైతుల నుంచి ప్రకాష్ అనే వ్యాపారి కొన్ని రోజుల క్రితం దాదాపు రూ.2 కోట్లకు పైగా విలువైన మిర్చి కొనుగోలు చేశాడు. డబ్బులు మాత్రం ఇవ్వలేదు. అడిగితే అదిగో ఇదిగో అంటూ తప్పించుకు తిరుగుతున్నాడు. దీంతో బాధిత రైతులు సూరి, రామచంద్ర, సుంకన్న, ఖలంధర్, గంగాధర, వన్నూరుస్వామి, కుమారి, మనోహర్, లోకేష్, మారెన్న, రామాంజి తదితరులు మంగళవారం బొమ్మనహాళ్ పోలీసులను ఆశ్రయించారు. ఈ విషయంపై ఎస్‌ఐ నబీరసూల్ వివరణ కోరగా.. ఫిర్యాదు అందిందని, విచారణ చేస్తున్నట్లు చెప్పారు.

### పోలీసుల అదుపులో నలుగురు వడ్డీ వ్యాపారులు

**ధర్మవరం అర్బన్:** పట్టణంలోని శాంతినగర్‌లో రమణ, భారతి దంపతులపై దాడికి పాల్పడిన వడ్డీ వ్యాపారులు నలుగురు మంగళవారం లొంగిపోయారు. రమణ ఇంట్లోకి వడ్డీ వ్యాపారులు చొరబడి దాడి చేసిన వీడియో రాష్ట్రంలోనే సంచలనం రేపింది. బాధితుల ఫిర్యాదు మేరకు ధర్మవరం టూ టౌన్ సీఐ రెడ్డప్ప ఏడుగురిపై కేసు నమోదు చేశారు. దాడి ఘటన తర్వాత నిందితులు పరారీలో ఉండగా.. పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి వారి కోసం గాలిస్తున్నారు. ఈ నేపథ్యంలో నలుగురు నిందితులు మంగళవారం ఓ న్యాయవాది ద్వారా డీఎస్పీ కార్యాలయంలో లొంగిపోయారు.

## క్లుప్తంగా

### చైన్‌స్నాచర్ అరెస్ట్



నిందితుడిని అరెస్ట్ చూపుతున్న పోలీసులు

గుంతకల్లు టౌన్: ఒంటరిగా వెళ్తున్న మహిళలను లక్ష్యంగా చేసుకుని వారి మెడలోని బంగారు గొలుసులను అపహరిస్తున్న ఓ యువకుడిని అరెస్ట్ చేసి, మూడు బంగారు గొలుసులు స్వాధీనం చేసుకున్నట్లు గుంతకల్లు వన్‌టౌన్ సీఐ మనోహర్ తెలిపారు. మంగళవారం స్థానిక వన్‌టౌన్ పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుడి వివరాలను ఆయన వెల్లడించారు. గుంతకల్లులోని కొనకొండ్ల రోడ్డులో ఉన్న భీమా పార్క్ వద్ద మంగళవారం అనుమానాస్పదంగా తచ్చాడుతున్న కంబదూరు మండలం వెంకటాంపల్లికి చెందిన ఎనుముల మారుతీప్రసాద్‌ని పోలీసులు అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారణ చేశారు. దీంతో చైన్ స్నాచింగ్‌ల అంశం వెలుగు చూసింది. గత నెల 7న గుంతకల్లులోని సాయిబాబా గుడి వీధికి చెందిన రాయల పుష్పావతి, ఈ నెల 17న ఎల్‌ఐసీ ఆఫీసు వద్ద మల్లీశ్వరితో పాటు గార్లదిన్నె మండలం గుడ్డాలపల్లి గ్రామం వద్ద ఓ మహిళ మెడలోని బంగారు గొలుసును బలవంతంగా లాక్కొని ఉడాయించినట్లు నేరాన్ని అంగీకరించాడు. దీంతో రూ.7.50 లక్షల విలువైన మూడు బంగారు గొలుసులు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు.

### ట్రాక్టర్ బోల్తా.. యువకుడి మృతి



వినోద్‌కుమార్ (ఫైల్)

తాడిపత్రి టౌన్: ట్రాక్టర్ బోల్తాపడిన ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. తాడిపత్రి మండలం ఆలూరు గ్రామానికి చెందిన జక్కయ్య, రూపకమ్మ దంపతుల కుమారుడు వినోద్‌కుమార్ (26)కు రెండేళ్ల క్రితం శ్వేత అనే యువతితో వివాహమైంది. వీరికి ఏడాది వయసున్న కుమారుడు ఉన్నాడు. ఇద్దరూ కూలి పనులతో చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం ఓ వ్యవసాయ తోటకు మట్టి తోలేందుకు ట్రాక్టర్ తీసుకొని గ్రామం నుంచి వెళ్తుండగా రహదారికి అడ్డుగా ఉన్న మట్టికుప్పను ఎక్కడంతో ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడింది. ఘటనలో తీవ్రంగా గాయపడిన వినోద్‌కుమార్‌ను వెంటనే తాడిపత్రిలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తీసుకెళుతుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

# పీడిస్తున్న యూరియా కొరత

- ఇబ్బందుల్లో అన్నదాతలు
- పట్టించుకోని పాలకులు



అనంతపురం సమీపంలోని వడియంపేట వద్ద వరినాట్లు వేస్తున్న దృశ్యం

గుమ్మఘట్ట: జిల్లా రైతులను యూరియా కష్టాలు వెంటాడుతున్నాయి. సీజన్ ప్రారంభంలోనే పంటల సాగు విస్తీర్ణాన్ని అంచనా వేసి రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాల్సిన ప్రభుత్వం ఈ మేరకు చర్యలు తీసుకోలేదు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

**అంచనా వేయలేకపోయిన అధికారులు**

ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా వేలాది హెక్టార్లలో రైతులు మొక్కజొన్న, వేరుశనగ, కంది, ఆముదం, వరి, పత్తి పంటలు సాగు చేశారు. ముఖ్యంగా హెచ్చెల్సీ పరిధితో పాటు వ్యవసాయ బోరు బావుల కింద మొక్కజొన్న, పత్తి, టమాట, మిరప, వరి నాట్లు ఊపందుకున్నాయి. ఈ పంటలకు యూరియా వినియోగం ఎక్కువగానే ఉంటోంది. దీంతో యూరియా కోసం పదిహేను రోజులుగా రైతు సేవా కేంద్రాల చుట్టూ రైతులు తిరుగుతున్నారు. సీజన్ ప్రారంభంలోనే పంట సాగు విస్తీర్ణాన్ని అంచనా వేయడంలో అధికారులు విఫలమవడంతోనే యూరియా కొరత నెలకొన్నట్లుగా తెలుస్తోంది. దీంతో బహిరంగ మార్కెట్‌లో అధిక ధరతో యూరియా కొనుగోలు చేయాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం అధిక ధర ఇచ్చేందుకు సిద్ధపడుతున్నా... స్టాకు లేదని వ్యాపారులు చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయంపై రాయదుర్గం ఏడీఏ పద్మజ మాట్లాడుతూ.. ఫర్టిలైజర్ షాపు నిర్వాహకులు, డీలర్లు స్టాక్ వివరాలను ఆన్‌లైన్‌లో సక్రమంగా నమోదు చేయకపోవడంతో సమస్య ఉత్పన్నమైందన్నారు. దీంతో అంచనా వేయలేకపోయినట్లు వివరించారు. అయితే యూరియా కొరత ఉన్నట్లు ఇప్పటి వరకూ తమ దృష్టికి రాలేదని, సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని పేర్కొన్నారు

**అప్పుల పాలవుతాం**



రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని యూరియా కొరత లేకుండా చూడాలి. పంటల సాగు కోసం ఇప్పటికే వేలాది రూపాలను అప్పు చేసి పెట్టుబడి పెట్టాం. మొక్క ఎదుగుదలకు యూరియానే ముఖ్యం. సకాలంలో పంటలకు యూరియా అందిస్తే దిగుబడి కాస్తోకూస్తో చేతికి వస్తుంది. లేకుంటే అప్పులే మిగులుతాయి.

– రైతు రామాంజనేయులు, గోనబావి గ్రామం, గుమ్మఘట్ట మండలం

**చాలా బాధేస్తోంది**



సాగు చేసిన పంటలు ఎదుగుదల లేకుండా పోయాయి. వీటిని చూస్తుంటే చాలా బాధేస్తోంది. పంటల సాగు కోసం వేలాది రూపాయలు అప్పుటు చేసి పెట్టుబడి పెట్టాం. సకాలంలో యూరియా అందించకపోతే మొక్క ఎదుగుదల లేక దిగుబడులు చేతికి అందే పరిస్థితి ఉండదు. రోజూ రైతు సేవా కేంద్రాలు, ఫర్టిలైజర్ దుకాణాల వద్దకెళ్లి అడిగితే యూరియా లేదని అంటున్నారు.

– రైతు జంగలి ఎర్రిస్వామి, బేలోడు గ్రామం, గుమ్మఘట్ట మండలం

**బాధ్యత మరిచారు**



రైతుల అవసరాలపై పాలకులు, అధికారులు ముందస్తుగా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలి. అయితే ఈ విషయంలో వారు బాధ్యత మరిచారు. ఫలితంగా రైతులు ఇబ్బంది పడాల్సి వస్తోంది. సమస్యకు పరిష్కారం చూపకపోతే పోరాటానికి సిద్ధమవుతాం.

– మెట్టు గోవిందరెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, రాయదుర్గం

### ‘పీ-4’ నిర్బంధం చేస్తే బహిష్కరిస్తాం : యూటీఎఫ్



డీఈఓ ప్రసాద్‌బాబుకు వినతిపత్రం ఇస్తున్న యూటీఎఫ్ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: పీ-4 (జీరో పావర్టీ) కార్యక్రమంలో భాగంగా విద్యార్థి కుటుంబాలను ఉపాధ్యాయులు తప్పనిసరిగా దత్తత తీసుకోవాలంటూ విద్యాశాఖ అధికారులు నిర్బంధం చేయడాన్ని యూటీఎఫ్ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు ఆ శాఖ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోవిందరాజులు, లింగమయ్య, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు రమణయ్య తెలిపారు. ఈ మేరకు మంగళవారం డీఈఓ ప్రసాద్‌బాబును కలిసి వినతిపత్రం అందజేసి, మాట్లాడారు. రాష్ట్రంలో పేదరిక నిర్మూలన పేరుతో సీఎం చంద్రబాబు ప్రారంభించిన పీ-4 కార్యక్రమంలో సంపన్నులు ముందుకు వచ్చి పేద కుటుంబాలను దత్తత తీసుకోవాలనే నిబంధన ఉందన్నారు. అయితే ఈ కార్యక్రమానికి సంపన్న వర్గాల నుంచి స్పందన రాకపోవడంతో ఆ భారాన్ని ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులపై నెట్టడం సరికాదన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ఉన్నతాధికారులు ముందుగా పేద కుటుంబాలను దత్తత తీసుకుని ఆదర్శంగా నిలవాలన్నారు. కానీ, ఇప్పటి వరకూ ఏ ఒక్కరూ ఒక్క కుటుంబాన్ని దత్తత తీసుకున్న దాఖలాలు లేవన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు మాత్రం పేద కుటుంబాలను దత్తత తీసుకోవాలని ప్రభుత్వం నిర్బంధించడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. ఉపాధ్యాయులపై నిర్బంధం చేస్తే పీ-4 కార్యక్రమాన్ని బహిష్కరిస్తామని హెచ్చరించారు. డీఈఓను కలిసిన వారిలో యూటీఎఫ్ నాయకులు సుబ్బరాయుడు, చంద్రమోహన్, కోటేశ్వరప్ప, శ్రీనివాసులు, ముసలప్ప, పవన్ కుమార్, డీకే నారాయణ, రమేష్ ఉన్నారు.

## విత్తన లోపమా! ప్రకృతి శాపమా?

- సాగు చేసి 45 రోజులవుతున్నా పిందె దశలోనే కళింగర పంట
- ఆదుకోవాలని వేడుకుంటున్న రైతన్న



పసలూరులో సాగుచేసిన కళింగర పంట

పెద్దపప్పూరు: విత్తన లోపమో.. ప్రకృతి శాపమో తెలియదు కానీ, కళింగర సాగు చేసి 47 రోజులవుతున్నా పంట ఎదుగుదల లేక పిందె ధశ లోనే ఉండిపోయింది. వివరాలు.. పెద్దపప్పూరు మండలం పసలూరు గ్రామానికి చెందిన రైతు మద్దా ప్రసాద్ తనకున్న 8 ఎకరాల భూమిలోని 3 ఎకరాల్లో గత నెల 13న కళింగర పంట సాగు చేశాడు. ఇటీవల మరో మూడు ఎకరాల్లో అదే పంటను సాగు చేశాడు. సాధారణంగా విత్తనం వేసిన 60 రోజులకు పంట కోతకు వస్తుంది. ప్రస్తుతం 47 రోజులవుతున్న తొలి దశలో విత్తనమేసిన కళింగర పంట ఎలాంటి ఎదుగుదల లేదు. ఎన్ని మందులు పిచికారీ చేసినా ఫలితం లేకపోయింది. పిందే దశలోనే మగ్గిపోతోంది. దీంతో సదరు రైతు విత్తన కంపెనీ దృష్టికి విషయాన్ని తీసుకెళ్లినా వారి నుంచి స్పందన లేదు. క్షేత్ర స్థాయిలో పండ్ల తోటలను పరిశీలించి సలహాలు సూచనలు ఇవ్వాల్సిన అధికారులు అటుగా దృష్టి సారించకపోవడంతో మండలంలోని ఎంతో మంది రైతులు నష్టపోతున్నారు. పంట కోసం ఇప్పటి వరకూ రూ. 2 లక్షలకు పైగా అప్పు చేసి ఖర్చు పెట్టానని, పంటలో ఎలాంటి ఎదుగుదల లేకపోవడంతో అప్పులు ఎలా తీర్చాలో తెలియడం లేదని, తనను ప్రభుత్వమే ఆదుకోవాలని బాధిత రైతు మద్దా ప్రసాద్ వేడుకుంటున్నాడు.

**నివేదిక పంపుతాం**



కళింగర సాగు చేసి 43 రోజులవుతున్నా పంటలో ఎదుగుదల లేదని, పిందె పిడికెడు సైజులోనే మగ్గిపోతోందని ఫోన్ ద్వారా రైతు మద్దా ప్రసాద్ సమాచారం అందించారు. దీనిపై వ్యవసాయ శాఖ అధికారులను సమన్వయం చేసుకుని క్షేత్రస్థాయిలో పంటను పరిశీలించి, లోపం ఎక్కడుందో గుర్తించి ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తాం.

– ఉమాదేవి, హెచ్‌ఓ, తాడిపత్రి

## దంపతుల మృతి కేసులో వీడిన మిస్టరీ

- పెళ్లైన 8 నెలలకే మనస్పర్థలు
- రాజీ పడలేక ఇద్దరూ ఉరి వేసుకుని ఆత్మహత్య



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

బొమ్మనహాళ్: దంపతుల అనుమానాస్పద మృతి కేసులో మిస్టరీని పోలీసులు ఛేదించారు. మనస్పర్థల కారణంగానే వారు ఆత్మహత్య చేసుకున్నట్లుగా నిర్ధారించారు. వివరాలను మంగళవారం రాయదుర్గం రూరల్ సీఐ వెంకటరమణ, బొమ్మనహాళ్ పీఎస్ ఎస్‌ఐ నబీరసూల్ వెల్లడించారు. కర్ణాటకలోని హోస్పేట్‌కు చెందిన దంపతులు సోమవారం బొమ్మనహాళ్ మండలం నేమకల్లులో ఉరి వేసుకున్న స్థితిలో మృతి చెందిన విషయం తెలిసిందే. ఘటనపై అనుమానాలు వ్యక్తం కావడంతో ఆ దిశగా పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు ముమ్మరం చేశారు. హోస్పేట్ తాలూకా నాగేనహళ్లి గ్రామానికి చెందిన ఆఫ్రీనా (21), హోస్పేట పట్టణానికి చెందిన రహమాన్ (25) రెండేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఈ క్రమంలో ఇరు కుటుంబాలను పెద్దలను ఒప్పించి 8 నెలల క్రితం పెద్దల సమక్షంలోనే పెళ్లి చేసుకున్నారు. పెయింటింగ్ పనులతో రహమాన్ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ క్రమంలో 4 నెలల క్రితం నేమకల్లు గ్రామంలోని ఆర్య వైశ్య కాంప్లెక్స్‌లో 21వ నంబర్ గదిని అద్దెకు తీసుకు ఆఫ్రీనా సోదరుడు షాబాషాతో కలసి ఉంటూ స్థానికంగా పెయింటింగ్ పనులో చేస్తున్నాడు. అయితే కొన్ని రోజులుగా రహమాన్ తాగుడుకు బానిస కావడంతో భార్య సర్దిచెబుతూ వచ్చింది. తాగుడు వల్ల కలిగే అనర్థాలను వివరించి, మద్యానికి బానిస కావొద్దని నచ్చచెబుతూ వచ్చింది. అయినా రహమాన్‌లో మార్పు రాలేదు. దీంతో ఇద్దరి మధ్య మనస్పర్థలు మొదలయ్యాయి. వారం రోజుల క్రితం ఆఫ్రీనా తన సోదరుడితో కలసి స్వగ్రామానికి వెళ్లి, సోమవారం తిరిగి వచ్చింది. ఆ సమయంలో దంపతులిద్దరి మధ్య గొడవ చోటుచేసుకుని రాజీ పడలేక ఇద్దరూ కలసి దుప్పట్టతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని బళ్లారిలోని విమ్స్‌లో పోస్టుమార్టం నిర్వహించి అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

### ‘ఫోరం’లో సీనియర్ టీచర్లకు ప్రాధాన్యతనివ్వాలి

- స్కూల్ టీచర్స్ అసోసియేషన్ డిమాండ్

అనంతపురం ఎడ్యుకేషన్: మండల అకడమిక్ మానిటరింగ్ ఫోరం సభ్యులుగా సీనియర్ టీచర్లకు ప్రాధాన్యత ఇవ్వాలని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ (ఏపీఎస్టీఏ) శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మారుతీప్రసాద్, జయకృష్ణ, వర్కింగ్, అసోసియేట్ ప్రెసిడెంట్స్ నరేష్‌కుమార్, మక్కిశెట్టి కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉపాధ్యాయుల ఎంపికలో కొందరు ఎంఈఓల తీరును వారు ఆక్షేపించారు. సీనియర్లను విస్మరించి ఇష్టారాజ్యంగా తమకు నచ్చిన వారిని, అనుకూలమైన వారిని మండల అకడమిక్ ఫోరం కమిటీలోకి తీసుకోవడంపై అసహనం వ్యక్తం చేశారు. సీనియర్ ఉపాధ్యాయులతో చర్చించకుండా ఉపాధ్యాయుల పేర్లు పంపడం సరైంది కాదన్నారు. మండలాల్లో ఉపాధ్యాయ సంఘాల నాయకులు, సీనియర్ ఉపాధ్యాయుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని మండల అకడమిక్ ఫోరం సభ్యులను నియమించాలని డిమాండ్ చేశారు.



### అధినేతతో భేటీ



జగన్‌మోహన్ రెడ్డిని కలసిన సాకే శైలజనాథ్, శంకర్‌నారాయణ, మహాలక్ష్మి శ్రీనివాస్, ఆలూరు సాంబశివారెడ్డి



వైఎస్ జగన్‌తో గోరంట్ల మాధవ్

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని సోమవారం విజయవాడలో మాజీ మంత్రి సాకే శైలజనాథ్, పీఏసీ సభ్యుడు ఎం.శంకర్‌నారాయణ, మహాలక్ష్మి శ్రీనివాస్, ఎస్‌ఆర్‌ఐ కో ఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డి, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి గోరంట్ల మాధవ్ మర్యాదపూర్వకంగా కలిశారు.

### వాహనాలు క్లియర్ చేయండి : ఎక్సైజ్ డీసీ



రికార్డులు పరిశీలిస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: మద్యం అక్రమ రవాణా కేసుల్లో పట్టుబడిన వాహనాలు త్వరగా క్లియర్ చేయాలని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగముద్దయ్య అన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీరామ్‌తో కలసి హిందూపురం ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌ను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కల్లు దుకాణల నుంచి శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపించాలని, కల్తీ కల్లు అరికట్టేలా అమ్మకందారుల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. ఎక్కువ కేసులు నమోదైన వారిని వారిని జిల్లా బహిష్కరణకు సిఫార్సు చేయాలన్నారు.

### ప్రమాదంలో వ్యక్తి మృతి

- ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన

అనంతపురం: నగరంలోని కమలానగర్‌లో మొబైల్ షాపు పెట్టుకుని జీవనం సాగిస్తున్న మహమ్మద్ ఆలీ అహమ్మద్ (47) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆలస్యంగా వెలుగు చూసిన ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురంలోని జానకీరామ్ నగర్‌లో నివాసముంటున్న మహమ్మద్ ఆలీ అహమ్మద్‌కు భార్య షేక్ యాస్మిన్, ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఈ నెల 25న సాయంత్రం నేషనల్ పార్క్ వద్ద ఉన్న సొంత స్థలాన్ని చూసొచ్చేందుకు ద్విచక్ర వాహనంపై అహమ్మద్ వెళ్లాడు. కాసేపటికే కుమార్తె సెల్‌ఫోన్ నంబర్‌కు గుర్తు తెలియని వ్యక్తి పోన్ చేసి రోడ్డు ప్రమాదంలో మీకు తెలిసిన వ్యక్తి గాయపడి ఉన్నాడని తెలపడంతో కుటుంబ సభ్యులు ఆగమేఘాలపై అక్కడకు చేరుకున్నారు. క్షతగాత్రుడిని అహమ్మద్‌గా గుర్తించి వెంటనే ఆటోలో జీజీహెచ్‌కు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తీసుకెళ్లారు. అక్కడ రెండు రోజుల పాటు చికిత్స అందించిన అనంతరం ఆస్పత్రి ఖర్చులు భరించలేక తిరిగి అనంతపురంలోని జీజీహెచ్‌కు తీసుకొచ్చారు. పరిస్థితి విషమించడంతో ఈ నెల 28న రాత్రి 7 గంటలకు అహమ్మద్ మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు మూడో పట్టణ పోలీసులు తెలిపారు.

### అంతర పంటల పరిశీలన

గుత్తి: మండలంలోని కరిడికొండ గ్రామంలో వాతావరణ సానుకూల వ్యవసాయ పథకంలో భాగంగా వర్షాధారంగా అంతర పంటలుగా సాగు చేసిన కంది, సజ్జ, ఆముదం తదితర పంటను మంగళవారం అనంతపురం వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు పరిశీలించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు డాక్టర్ లక్ష్మణ్, డాక్టర్ భాస్కర్ రావు అంతర పంటల సాగులో మెలకువలను రైతులకు సూచించారు. తెగుళ్ల నివారణకు వాడాల్సిన మందులు, మోతాదు, పిచికారీ చేయాల్సిన విధానాలను వివరించారు.

## గుక్కెడు నీటి కోసం పది రోజులుగా నిరీక్షణ



మొలకాల్మూరు రోడ్డుపై ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

- దాహార్తి తీర్చాలంటూ రాయదుర్గం రహదారులపై ఖాళీ బిందెలతో మహిళల నిరసన

రాయదుర్గం టౌన్: ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఇలాకాలో తాగునీటి కష్టాలు తారస్థాయికి చేరుకున్నాయి. పది రోజులుగా రాయదుర్గం మున్సిపాలిటీ పరిధిలో తాగునీరు అందక ప్రజలు సతమతమవుతున్నారు. కరెంటు సమస్య, మోటార్ల మరమ్మతు కారణమంటూ అధికారులు బుకాయిస్తూ నీటి సరఫరాలో తీవ్ర జాప్యం వహిస్తుండడంతో మంగళవారం పట్టణంలోని మొలకాల్మూరు రోడ్డులో రెండు చోట్ల, మారెమ్మగుడి ఏరియాలో ఒకచోట ప్రధాన రహదారులపై మూడు చోట్ల స్థానిక మహిళలు ఖాళీ బిందెలతో బైఠాయించి నిరసన తెలిపారు. తమ కాలనీలకు దాదాపు పది రోజులు కావస్తున్నా కొళాయిల ద్వారా తాగునీరు అందక ఇబ్బంది పడుతున్నామని వాపోయారు. కనీస అవసరాలకు సైతం నీరు లేక లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ ఏఈ నరసింహులు, ఫిట్టర్లు అక్కడికి చేరుకుని మహిళలకు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. ఆందోళనకారులు వినకపోవడంతో చివరకు అవసరమైన ప్రాంతాలకు వాటర్ ట్యాంకుల ద్వారా తాగునీటి సరఫరా చేస్తామని భరోసానిచ్చి, ఆందోళనను విరమింపజేశారు. రెండురోజుల్లోగా కరెంటు సమస్య, మోటారు మరమ్మతులు పూర్తి చేసి కాలనీలకు నీటి సరఫరాను పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు.

### నేడు మంత్రి పార్థసారథి రాక

అనంతపురం అర్బన్: రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి జిల్లాలో బుధవారం పర్యటించనున్నారు. ఉదయం 10 గంటలకు కళ్యాణదుర్గం పట్టణం చేరుకుంటారు. స్థానిక సుబ్రమణ్యస్వామి ఆలయాన్ని సందర్శించిన అనంతరం వాల్మీకి సర్కిల్ వద్ద అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవంలో, పాతబస్టాండ్‌లో మౌలిక సదుపాయాల పనులకు భూమిపూజ కార్యక్రమంలో పాల్గొంటారు. ఉదయం 11.20 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు చాపిరిలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 1.30 వరకు పార్టీ కార్యకర్తలతో సమావేశంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 2 నుంచి 3.30 గంటల వరకు గృహ నిర్మాణంపై అధికారులతో సమీక్షిస్తారు. అనంతరం అక్కడి నుంచి బెంగుళూరుకు వెళతారు.

## ఐసీయూలో రోగులకు ప్రత్యక్ష నరకం



ఏసీలు పని చేయకపోవడంతో ఊపిరాడక ఇబ్బంది పడుతున్న వృద్ధుడు



ఓ వృద్ధుడికి టవాల్, కర్చీప్‌తో ఊపుతున్న వృద్ధురాలు, బాలుడు

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని సర్జికల్ విభాగానికి సంబంధించిన ఎస్‌ఐసీయూలో ఏసీలు పని చేయకపోవడంతో రోగులు ఊపిరి ఆడక ప్రత్యక్ష నరకం అనుభవిస్తున్నారు. ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాల్సిన ఆస్పత్రి అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తుండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వాస్తవానికి సర్జికల్‌లోని ఎస్‌ఐసీయూలో పది ఏసీలున్నాయి. ఇందులో ఏ ఒక్క ఏసీ కూడా పని చేయడం లేదు. సర్జికల్ ఐసీయూలో ప్రాణాంతకమైన కేసులను ఉంచి చికిత్స చేస్తుంటారు. ఇన్‌ఫెక్షన్లు సోకకుండా యూనిట్ తలుపులు సదా మూసి ఉండాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో ఏసీలుంటేనే రోగులకు ఊరటగా ఉంటుంది. కొన్ని నెలలుగా ఏసీ సమస్య వెంటాడుతుండడంతో గాలి ఆడక ఇబ్బంది పడుతున్న రోగులకు టవాళ్లు, కర్చీఫ్‌లు ఊపుతూ ఉపశమనం కలిగిస్తున్నారు. ఇప్పటికైనా ఆస్పత్రి అధికారులు మేల్కొని తగు చర్యలు తీసుకుంటారో లేదో వేచి చూడాలి.

## క్లుప్తంగా

### కీర్తన ఫైనాన్స్ స్కామ్‌పై విచారణ చేయాలి



మాట్లాడుతున్న ఏఐవైఎఫ్, మహిళా సమాఖ్య నేతలు

**అనంతపురం అర్బన్:** కీర్తన ఫైనాన్స్ సంస్థలో తాకట్టుపెట్టిన బంగారం మార్పిడి వ్యవహారంపై సమగ్ర విచారణ జరపాలని ఏఐవైఎఫ్, మహిళ సమాఖ్య నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, మహిళ సమాఖ్య జిల్లా కార్యదర్శి పద్మావతి మాట్లాడారు. ఫైనాన్స్ సంస్థలో తాకట్టుపెట్టిన బంగారం నిజంగా ఖాతాదారుల పేర్లతో ఉందా లేక మోసపూరిత వ్యవహారం చోటు చేసుకుందా అనే అంశాలపై స్వతంత్ర బృందం ద్వారా విచారణ జరిపించాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ఫైనాన్స్ సంస్థలపై ఆడిట్ చేయాలన్నారు. సమావేశంలో మహిళ సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు పార్వతిప్రసాద్, ఏఐవైఎఫ్, సమాఖ్య నాయకులు ధనుంజయ, దేవేంద్ర, శ్రీనివాసులు, యశోదమ్మ, కమ్మక్క తదితరులు పాల్గొన్నారు.

### ఐటీ, సివిల్ విద్యార్థులకు ఉద్యోగాలు



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

**అనంతపురం రూరల్:** నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీ ఆధ్వర్యంలో మంగళవారం పీవీకేకే ఐటీ కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఐటీ, సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు లభించినట్లు పీవీకేకే ఐటీ కళాశాల ప్రిన్సిపాల్ రమేష్‌బాబు తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన వారు గ్రాడ్యుయేట్ ట్రైనీ ఇంజినీర్ హోదాలో దేశ వ్యాప్తంగా వివిధ ప్రాజెక్టుల్లో పని చేస్తారన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి వార్షిక వేతనం రూ.4.5 లక్షలు ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల చైర్మన్ పల్లె వెంకటకృష్ణకిశోర్‌రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కళాశాలలో చదివే విద్యార్థులను ఉద్యోగులుగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమన్నారు. నాగార్జున కన్‌స్ట్రక్షన్ హెచ్‌ఆర్ మేనేజర్ విష్ణుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### పరివార దేవతా ప్రతిష్ట మహోత్సవాలు



రామనగర్‌లోని వేంకటేశ్వరాలయంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

**అనంతపురం కల్చరల్:** రామనగర్‌లోని వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో మూడు రోజుల పాటూ జరిగే పరివార దేవతా ప్రతిష్ట మహోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు ఉదయం గణపతి పూజతో ఆరంభమై గోపూజలు, హోమాలను వేదపండితులు శాస్త్రోక్తంగా ఆరంభించారు. మృత్సంగ్రహం పూర్వక అంకురార్పణ, సాయంత్రం అష్టావధాన సేవ, మహా మంగళహారతి అనంతరం తీర్థప్రసాద వితరణ జరిగాయి. గోవింద నామ స్మరణతో భక్తులు ఆలయాన్ని మార్మోగించారు. నిర్వాహకులు మాట్లాడుతూ మరో రెండు రోజుల పాటూ సాగే ఆలయ వార్షికోత్సవాలు, కల్యాణోత్సవంలో భక్తులు పాల్గొనాలని కోరారు.

### ఈ క్రాప్ బుకింగ్ చేయించుకుంటేనే పరిహారం

**రాప్తాడు:** ఖరీఫ్‌లో పంటలు సాగు చేసిన రైతులు ఈ–క్రాప్ బుకింగ్ చేయించుకుంటేనే పరిహారం వస్తుందని తహసీల్దార్ విజయకుమారి, ఏఓ కృష్ణ చైతన్య తెలిపారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, మండల వ్యవసాయ సిబ్బందితో ఈ–క్రాప్ బుకింగ్‌పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీఆర్వోలు, వ్యవసాయ సిబ్బంది సంయుక్తంగా ఈ–క్రాప్ బుకింగ్ చేయాలన్నారు. ఈ–క్రాప్ బుకింగ్ నమోదు చేయడం ద్వారా రైతులకు ప్రభుత్వం నుంచి వచ్చే అన్నదాన సుఖీభవ, ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్, పీఎం కిసాన్ పథకాలు అందుతాయని గుర్తు చేశారు.

### జూదరుల అరెస్ట్

**గుంతకల్లుటౌన్:** పట్టణంలోని హనుమేష్‌నగర్‌లో ఉన్న బయలు ప్రదేశంలో పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.10 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ సీఐ మనోహర్ తెలిపారు. ముందుగా అందిన సమాచారం మేరకు మంగళవారం మధ్యాహ్నం పేకాట స్థావరంపై దాడులు చేసి జూదరులను అరెస్ట్ చేశామన్నారు.

# భక్తిశ్రద్ధలతో గరుడ పంచమి వేడుకలు

**అనంతపురం కల్చరల్:** గరుడ పంచమి వేడుకలు మంగళవారం భక్తిశ్రద్ధలతో జరిగాయి. నగరంలోని పలుచోట్ల పుట్టల వద్ద భక్తజనం బారులు తీరి ఆవుపాలు, పండ్లు, చలిమిడితో సర్పరూపాలను కొలుచుకున్నారు. చేతులకు పవిత్ర కంకణాలను కట్టుకుని పుట్టలకు సైతం పసుపు కుంకుమలతో కూడిన దారాలతో అలంకారం చేసి పూజించారు. అలాగే రెండో రోడ్డులోని శ్రీపీఠం, రామనగర్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం, ఆర్ఎఫ్‌రోడ్డులోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వరాలయం, మొదటిరోడ్డు శ్రీకాశీవిశ్వేశ్వరాలయం తదితర చోట్ల నాగుల కట్ట వద్ద పెద్ద ఎత్తున చేరి గరుడ పంచమి వేడుకలు జరుపుకున్నారు. ప్రధాన అర్చకులు పర్వదిన విశిష్టతను తెలియజేసి తీర్థ ప్రసాదాలనందించారు.

**రాప్తాడు:** రాప్తాడులో ఉమా నీలకంఠేశ్వర స్వామి, లక్ష్మీ పండమేటి రాయుడు, షిర్డి సాయి బాబా ఆలయ ప్రాంగణాల్లో మంగళవారం గరుడ పంచమి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. గ్రామాల్లో నాగుల కట్టలు, పుట్టలు, శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మహిళలు ఉదయాన్నే ఉపవాసాలతో గ్రామాల్లోని నాగదేవతా విగ్రహాలు, పుట్టలకు పూజలు చేశారు. పుట్టలకు పసుపు కుంకుమలు, తోరాలు (పసుపు పూసిన పచ్చిదారాలు) అలంకరించి పాలుపోసి చలిమిడి ముద్దలు, నూగుల ముద్దలు ప్రసాదంగా ఉంచారు. కుటుంబాలు చల్లగా ఉండాలంటే నాగ దేవతల అనుగ్రహం ఉండాలని కోరుకున్నారు.



పంపనూరులో హోమం నిర్వహిస్తున్న భక్తులు



నాగ పంచమి వేడుకల్లో పాల్గొన్న జిల్లా అదనపు జడ్జి సత్యవాణి



పూజలు అందుకున్న నాగప్రతిమలు

**పంపనూరులో..**

**ఆత్మకూరు:** మండలంలోని పంపనూరులో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం నాగ పంచమి వేడుకలు ఘనంగా జరిగాయి. సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ఆలయ అర్చకులు సర్పసూక్త క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం హోమాలు, పవమాన సూక్త పారాయణంతో పాటు అభిషేకాలు చేపట్టారు. జిల్లా అదనపు జడ్జి సత్యవాణి ఆలయానికి చేరుకుని మొక్కులను తీర్చుకున్నారు. ఈసందర్భంగా జడ్జికి ఆలయ అర్చకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. మహా మంగళ హారతి అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

# దూకుడు పెంచిన వైఎస్సార్ సీపీ



ఓబుళదేవనగర్‌లో ప్రజలతో మాట్లాడుతున్న మేయర్ వసీంసలీం, నాయకులు



బ్రాహ్మణవీధిలో ప్రజలతో మాట్లాడుతున్న నగరాధ్యక్షుడు చింతా సోమశేఖర్‌రెడ్డి, నేతలు



30వ డివిజన్‌లో ప్రజలతో మాట్లాడుతున్న ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మల్లెమీద నరసింహులు

- ఇంటింటా బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం

**అనంతపురం కార్పొరేషన్:** కూటమి ప్రభుత్వం 13 నెలల పాలనలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను తెలుసుకునేందుకు పార్టీ అధిష్టానం పిలుపునిచ్చిన బాబు షూరిటీ..మోసం గ్యారెంటీ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు దూకుడు పెంచాయి. మంగళవారం నగరంలోని వివిధ డివిజన్లలో రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో కార్యక్రమం జోరుగా సాగింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీసుకువచ్చిన విప్లవాత్మక సంస్కరణలను ప్రజలకు తెలియజేశాయి పార్టీ శ్రేణులు. అదే విధంగా చంద్రబాబు మోసపు హామీలకు సంబంధించి కరపత్రాలను ప్రజలకు అందించి, క్యూఆర్ కోడ్ ద్వారా వారికి జరిగిన నష్టాన్ని వివరించారు. 32వ డివిజన్‌లో మేయర్ వసీం డివిజన్‌లో రూ.1.5 కోట్ల అభివృద్ధి పనులను చేపట్టిన విషయాన్ని ప్రజలకు తెలియజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కమల్ భూషణ్, ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెన్నోబులేసు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మల్లెమీద నరసింహులు, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు నాయక్, 12వ డివిజన్‌లో పార్టీ నగరాధ్యక్షుడు చింతా సోమశేఖర్ రెడ్డి, బూత్ కమిటీ జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్ రెడ్డి, సీనియర్ నాయకులు తిరుపీధుల జగదీష్, పార్టీ కార్యదర్శి వంకదారి వెంకటకృష్ణ, అసెంబ్లీ నియోజకవర్గం వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షులు సత్రసాల మంజునాథ్, నాయకులు పావురాల జగదీష్, సుల్తాన్, జావిద్, షేక్ షబ్బీర్, రఫి, సోహైల్, రాజేష్, సుంకు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### పాడి ఆవుకు ఆపరేషన్

**అనంతపురం అగ్రికల్చర్:** గర్భంతో ఉన్న పాడి ఆవుకు మంగళవారం స్థానిక సాయినగర్‌లో ఉన్న పశువైద్యశాలలో పశుసంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ జి.పద్మనాభం నేతృత్వంలోని వైద్య బృందం ఆపరేషన్ చేసి ప్రాణదానం చేశారు. శ్రీసత్యసాయి జిల్లా కనగానపల్లి మండలం భానుకోట గ్రామం మానేరు ఈశ్వరయ్యకు చెందిన పాడి ఆవు నాలుగు రోజులుగా ఈనలేక అవస్థలు పడుతోంది. స్థానిక పశుసేవకులు ఇంజెక్షన్లు ఇచ్చినా ఫలితం లేకపోవడం, గర్భద్వారం ద్వారా చీము పట్టి దుర్గంధం రావడం, రోజురోజుకు మేత తినక క్షీణించిపోయి ప్రాణాపాయ స్థితికి చేరుకుంది. లోపల దూడ చనిపోయివుంటుందని, ఇలాగే ఆలస్యం చేస్తే పాడి ఆవుకు కూడా ప్రాణాపాయం తప్పదని, వెంటనే ఆపరేషన్ చేయాలని చెప్పడంతో రైతు అంగీకరించాడు. ఈ క్రమంలో డాక్టర్ పద్మనాభం బృందం తక్షణం పాడి ఆవును తన సొంత వాహనంలో భానుకోట నుంచి అనంతపురం తీసుకొచ్చారు. చాకచక్యంగా సిజేరియన్ ఆపరేషన్ చేసి లోపల చనిపోయిన దూడను బయటకు తీసి ఆవుకు ప్రాణదానం చేశారు. పాడి ఆవు ఆరోగ్యం కోసం మందులు, ఫ్లూయిడ్స్ అందించారు. అంబులెన్స్ డాక్టర్ సుచరిత, తిరుపతి పశువైద్యకళాశాల టెనింగ్ డాక్టర్స్, మడకశిర పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

# రస్తా పనులు ఆపి న్యాయం చేయండి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎం.బండమీదపల్లి రైతులు

**రాప్తాడు:** 'మాది పూర్వం పట్టా భూమి, మా పొలాలు మీదుగా మా గ్రామ రైతుల పొలాలకు రస్తా లేదు. కొందరు రైతులు దౌర్జన్యంగా మా పొలం మీదుగా మట్టి రోడ్డు వేస్తున్నారు. వెంటనే రోడ్డు పనులు ఆపి మాకు న్యాయం చేయండి' అంటూ ఎం.బండమీదపల్లి గ్రామానికి చెందిన మారక గిరిప్రసాద్‌రెడ్డి తహసీల్దార్ విజయకుమారికి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎం.బండమీదపల్లి గ్రామ పొలంలో తమ తండ్రి మారక వెంకట రామిరెడ్డి, చిన్నాన్న మారక సుబ్బా రెడ్డిలకు 238–2లో సర్వే నంబర్ 28.30 ఎకరాల భూమి ఉందన్నారు. మా భూమి దిగువన మా గ్రామానికి చెందిన మాజీ సర్పంచు మాధవయ్య, పలువురు రైతులు పరంధమ, కేశవయ్య, కాటమయ్య, పక్కీరప్ప, అక్కులప్ప, చిన్న ఉజ్జన్నలతో పాటు మరికొంత మంది రైతులకు భూములు ఉన్నాయన్నారు. వారి పొలాలకు రస్తా తమ పొలం మీదుగా లేదని, తమ పొలం దిగువన బాపన వంక మీదుగా రస్తా ఉందని తెలిపారు. స్పందించిన తహసీల్దార్ రస్తా సమస్యపై రైతులు వినతిపత్రం ఇచ్చారని, క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

### రోడ్డు ప్రమాదాల నివారణపై దృష్టి

**పెద్దవడుగూరు:** మండలంలోని కాశేపల్లి, మిడుతూరు, క్రిష్టిపాడు, గుత్తి అనంతపురం తదితర గ్రామాల సమీపంలోని జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టామని ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. మంగళవారం మండలంలోని కాశేపల్లి సమీపంలో జాతీయ రహదారిపై డివైడర్‌ను కొందరు వాహనదారులు పగులగొట్టి అడ్డదారులు ఏర్పాటు చేసుకున్నారు. అలాంటి ప్రమాదకర ప్రదేశాలలో జేసీబీతో గుంతలు తవ్వించారు. అలాగే వాహనదారులను అప్రమత్తం చేయడం కోసం రంబుల్ స్ట్రిప్స్, రేడియం స్టిక్కర్ సూచికలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

### విధుల్లో చేరిన రామగిరి సీఐ

**చెన్నేకొత్తపల్లి:** స్థానిక సర్కిల్ కార్యాలయంలో రామగిరి సీఐ శ్రీధర్ మంగళవారం తిరిగి విధుల్లో చేరారు. గత నెల 27 నుంచి సీఐ సెలవుపై వెళ్లిన విషయం తెలిసిందే. రామగిరి మండలం పాపిరెడ్డిపల్లి సమీపంలో హెలీప్యాడ్‌లో హెలీకాప్టర్ విండో షీల్డ్ డ్యామేజీ, ఏడుగుర్రాలపల్లిలో దళిత బాలికపై 14 మంది లైంగిక దాడి, ఎంపీపీ ఎన్నిక, పాపిరెడ్డిపల్లిలో కురుబ లింగమయ్యను టీడీపీకి చెందిన వారు హత్య చేయడం లాంటి కేసులు రాష్ట్రస్థాయిలో చర్చనీయాంశంగా మారాయి. దీంతో సీఐ నెల రోజులు సెలవుపై వెళ్లారు. ఈసందర్భంగా పలువురు ఎస్ఐలు సీఐను మర్యాదపూర్వకంగా కలిశారు.

# పేద విద్యార్థులపై 'కూటమి' కపట ప్రేమ



విద్యార్థులతో మాట్లాడుతున్న చంద్రశేఖర్‌యాదవ్

**అనంతపురం రూరల్:** పేద విద్యార్థులు పట్ల కూటమి ప్రభుత్వం కపట ప్రేమ చూపిస్తోందని, ప్రభుత్వ వసతిగృహాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌యాదవ్ మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని బీసీ బాలికల వసతి గృహాన్ని పరిశీలించారు. నాయకులు విద్యార్థినులతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌యాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వ వసతిగృహాల్లో సమస్యలు తాండవిస్తున్నా ప్రభుత్వంలో చలనం లేదన్నారు. జిల్లాలోని చాలా వసతిగృహాల్లో సరిపడా గదులు, మరుగుదొడ్లు లేకపోవడంతో విద్యార్థులు నరకయాతన అనిభవిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి వసతిగృహాల్లో మోనూ సక్రమంగా అమలు కావడంలేదన్నారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించకపోతే వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఉద్యమాలు చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నగరాధ్యక్షుడు కై లాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుల్తాన్ ఆదాం, జిల్లా ప్రధాన కార్యదర్శి సాయినితిన్, శివ, ఫయాజ్ వంశీనాయుడు, శేఖర్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

# దోసె కోసం వెళితే కరెంట్ షాక్

- ప్రాణాలతో బయటపడిన మధ్యప్రదేశ్ వాసి



భర్త రూపేంద్రను పట్టుకుని బోరున విలపిస్తున్న దీప

**అనంతపురం కార్పొరేషన్:** ట్రాన్స్ కో అధికారుల నిర్లక్ష్యం మధ్యప్రదేశ్ వాసి ప్రాణం మీదకు తెచ్చింది. జీసస్‌నగర్‌లోని విద్యుత్ సబ్‌స్టేషన్ ముందు జరిగిన ఘటనలో మధ్యప్రదేశ్‌కు చెందిన యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. మధ్యప్రదేశ్‌కు చెందిన రూపేంద్ర, అతని భార్య దీప, సోదరులు, తదితరులు ప్రభుత్వ సర్వజనాస్పత్రి మెడికల్ క్వార్టర్స్‌లో పని చేసేందుకు వచ్చారు. రూపేంద్ర దోసె తినేందుకు సబ్‌స్టేషన్ ఎదురుగా ఉన్న ఓ హోటల్‌కు వెళ్లాడు. టిఫిన్ ఆర్డర్ ఇచ్చేందుకు వెళ్లి హోటల్‌కు ముందున్న ఇనుప క్యాబిన్‌ను పట్టుకున్నాడు. దీంతో విద్యుదాఘాతానికి గురైన అతడు ఒక్కసారిగా గట్టిగా కేకలు వేశాడు. దీంతో హోటల్ నిర్వాహకుడు మోహన్ పరుగున వెళ్లి రూపేంద్రను పక్కకు లాగే ప్రయత్నం చేశాడు. దీంతో అతడు కూడా విద్యుదాఘాతానికి గురయ్యారు. తర్వాత అప్రమత్తమైన అతడు అక్కడున్న ఫ్యూజ్‌ను తొలగించాడు. దీంతో రూపేంద్ర ప్రాణాలతో బయటపడ్డాడు. విషయం తెలుసుకున్న భార్య దీప, తదితర కుటుంబ సభ్యులు ఏం జరిగిందోనంటూ బోరున విలపించడం అందరినీ కలచి వేసింది. విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యంతో ఇటీవల ఓ యువకుడు సాయినగర్ నాచురల్స్ షెలూన్ వద్ద ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే.

# సత్యసాయి రథయాత్రకు స్వాగతం

**గుత్తి/పామిడి:** విశ్వశాంతి కోసం భగవాన్ సత్య సాయి బాబా శత వసంతాల వేడుకల్లో భాగంగా దేశ వ్యాప్తంగా చేపట్టిన సత్యసాయి ప్రేమ ప్రవాహిని రథయాత్ర మంగళవారం గుత్తికి చేరింది. ఈ సందర్భంగా సత్యసాయి సేవా సమితి సభ్యులు, ఆలయాల నిర్వాహకులు, శ్రీ సాయి జూనియర్ కాలేజీ, శ్రీ సాయి హైస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘన స్వాగతం పలికారు. తాడిపత్రి రోడ్డు వద్ద నుంచి రాయల్ సర్కిల్ మీదుగా ఎన్టీఆర్ సర్కిల్ వరకూ.. అటు నుంచి శివాలయం మీదుగా షిరిడీ సాయిబాబా ఆలయం వరకూ రథయాత్రతో పాటు బైక్ ర్యాలీ నిర్వహించారు. చిన్న పిల్లలు కోలాటం చేశారు. మహిళలు భారీ ఎత్తున తరలివచ్చి స్వాగతం పలికారు. రథయాత్రకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో రథం ఇన్‌చార్జ్ రామచంద్రమూర్తి, సత్యసాయి సేవా సమితి కన్వీనర్ ఎంవీ రమణ, గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం రథయాత్ర పామిడికి చేరుకోగా సత్యసాయి సేవా సమితి సభ్యులు బైకు ర్యాలీతో నగరోత్సవం గావించారు. సమితి అధ్యక్షుడు కే విశ్వనాథ్, రాజేశ్వరి దంపతుల ఇంటి ఆవరణలో కలశ పూజార్చన, భజనలు చేశారు.

# బందోబస్తు మధ్య ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలను తొలగిస్తున్న దృశ్యం

**తాడిపత్రి రూరల్:** మండలంలోని యర్రగుంటపల్లిలో మంగళవారం రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను పోలీసు బందోబస్తు మధ్య రెవెన్యూ అధికారులు తొలగించే ప్రయత్నం చేశారు. ఇచ్చిన హామీ మేరకు పరిహారం చెల్లించకుండా ఆక్రమణలను తొలగించడంపై అధికారులతో పలువురు బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. 544డీ హైవే రోడ్డు పనుల్లో భాగంగా గ్రామంలోని రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇళ్లు, ఇతర కట్టడాల తొలగింపునకు మార్కెట్ ధర కంటే ఎక్కువగా ఇవ్వాలని గతంలో సర్వేకి వచ్చిన ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ అధికారులతో బాధితులు వాగ్వాదానికి దిగారు. ఆశించిన స్థాయిలో పరిహారం వచ్చేందుకు ప్రతిపాదనలు పంపుతామని వారు హామీ ఇచ్చి వెళ్లారు. రోడ్డుకు ఇరువైపులా దాదాపు 60 అక్రమ కట్టడాలను అధికారులు గుర్తించి వాటిలో 40 కట్టడాలకు మూడు నెలల క్రితం పరిహారం లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో వేశారు. తాము కోరిన విధంగా పరిహారం ఇవ్వకుండా తక్కువ మొత్తంలో బ్యాంకులో వేయడంపై బాధితులు మండిపడ్డారు. ఇదే విషయాన్ని అప్పట్లో తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లడంతో ఉన్నతాధికారులతో మాట్లాడుతానికి సర్దిచెప్పి పంపారు. ఆయన ఇచ్చిన హామీ మేరకు పరిహారం అందకపోవడంతో అప్పట్లో పనులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. పనులను పునరుద్ధరించడానికి బాధితులతో అధికారులు మరోసారి చర్చలు జరిపారు. రెండింతల పరిహారం ఇవ్వకుండా మొదట మంజూరు చేసిన మొత్తాన్ని సరిపెట్టే ప్రయత్నం చేయడంతో మంగళవారం అక్రమణల తొలగింపునకు అధికారులు వస్తున్నారన్న విషయం తెలుసుకున్న బాధితులు ముందు రోజు అడ్డుకునేందుకు సమావేశమయ్యారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ అధికారులు పోలీసు బందోబస్తును కోరారు. ఆక్రమణల తొలగింపుకు రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆక్రమణల తొలగింపుపై బాధితుడు నారాయణస్వామితో పాటు మరికొందరు అడ్డుకునే ప్రయత్నం చేశారు. పరిహారం పేరుతో కేవలం రూ.8 లక్షలకు పైగా మొత్తం మాత్రమే ఇచ్చారని పెద్ద ఇంటికి తక్కువ మొత్తం ఎలా ఇస్తారని అధికారులను ప్రశ్నించారు. ఆయనకు పోలీసు, రెవెన్యూ అధికారులు సర్దిచెప్పి ఆక్రమణ తొలగింపునకు ఉపక్రమించారు.

# ప్రభుత్వ విద్యా పరిరక్షణకు సంతకాల సేకరణ




సంతకాల సేకరణలో పాల్గొన్న ఏఐడీఎస్ఓ నాయకులు, విద్యార్థులు

**అనంతపురం ఎడ్యుకేషన్:** ప్రభుత్వ నిధులతో నడిచే విద్యను కాపాడాలని డిమాండ్ చేస్తూ ఆలిండియా డెమోక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ (ఏఐడీఎస్ఓ) అనంతపురం నగర కమిటీ ఆధ్వర్యంలో 10 లక్షల సంతకాల సేకరణ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈశ్వరచంద్ర విద్యాసాగర్ 134వ వర్ధంతి సందర్భంగా స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ఈ కార్యక్రమం చేపట్టారు. మానవ హక్కుల నాయకులు చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వాలు పాఠశాలల విలీనం పేరుతో మూసివేసే ప్రయత్నం చేస్తున్నాయన్నారు. మరోవైపు ప్రైవేట్ స్కూల్స్ రోజురోజుకూ పెరిగిపోతున్నాయన్నారు. ఇది విద్యార్థుల భవిష్యత్తుకు ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యా ప్రమాణాలు దెబ్బతీస్తున్న ఎన్ఈపీ–2020 ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఏఐడీఎస్ఓ జిల్లా నాయకులు సురేష్ మాట్లాడుతూ ఎంతోమంది మహానుభావుల త్యాగాలు, కృషి ఫలితంగా దేశంలో ప్రభుత్వ పాఠశాలలు ఏర్పడ్డాయన్నారు. వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రభుత్వ విద్య పరిరక్షణకై చేపట్టిన 10 లక్షల సంతకాల సేకరణ కార్యక్రమం డిసెంబర్ 28 వరకు జరుగుతుందన్నారు. ఏఐడీఎస్ఓ నాయకులు మహమ్మద్, నగర అధ్యక్షులు చరణ్ రాజ్, కార్యదర్శి చరణ్ తేజ్, సహాయ కార్యదర్శి చంద్రిమ, సభ్యులు శ్రావణి, రుద్రేష్, నాని, లక్షణ, బాబావలి, భవ్య, మైత్రి, మహేశ్వరి పాల్గొన్నారు.

### బాలిక అదృశ్యం

**రాప్తాడురూరల్:** అనంతపురం రూరల్ మండలం కందుకూరు గ్రామానికి చెందిన 16 ఏళ్ల బాలిక ఐదు రోజుల కిందట అదృశ్యమైంది. ఇటుకలపల్లి పీఎస్ ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాలు... ఈనెల 25న ఇంట్లో ఎవరూ లేని సమయంలో బయటికి వెళ్లిన సదరు బాలిక తిరిగి రాలేదు. కంగారుపడ్డ తల్లిదండ్రులు బంధువులు, స్నేహితులు, చుట్టుపక్కల వారిని విచారించినా ఆచూకీ లభించలేదు. దీంతో రెండు రోజుల కిందట తండ్రి లక్ష్మీనారాయణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ అమ్మాయి ఆచూకీ ఎవరికైనా తెలిస్తే 94901 06738, 94407 96807 నంబర్లకు సమాచారం అందించాలని ఎస్ఐ కోరారు.

### నల్లాని రాజేశ్వరికి డాక్టరేట్



**అనంతపురం:** శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని సోషియాలజీ విభాగంలో పరిశోధన చేసిన నల్లాని రాజేశ్వరికి డాక్టరేట్ ప్రదానం చేశారు. ప్రొఫెసర్ జీవీ రమణ పర్యవేక్షణలో 'అనంతపురం జిల్లాలో బాల కార్మిక వ్యవస్థ– సమస్యలు, సవాళ్లు– ఒక అధ్యయనం' అనే అంశంపై ఆమె పరిశోధన చేశారు. 2018–21 మధ్య కాలంలో నల్లాని రాజేశ్వరి ఉమ్మడి అనంతపురం జిల్లా బాలల సంక్షేమ సమితి(సీడబ్ల్యూసీ) చైర్‌పర్సన్‌గా సేవలు అందించారు. డాక్టరేట్ పొందిన సందర్భంగా ఆమెకు పలువురు అభినందనలు తెలిపారు.

### నేడు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి పర్యటన

**అనంతపురం టవర్‌క్లాక్:** బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ బుధవారం నగరంలో పర్యటించనున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షులు కొనకొండ్ల రాజేష్ మంగళవారం తెలిపారు. నగరంలో జరిగే పలు కార్యక్రమాల్లో మాధవ్ పాల్గొంటారన్నారు. కార్యక్రమాల్లో పార్టీ శ్రేణులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు సంధిరెడ్డి శ్రీనివాసులు, నాయకులు చిరంజీవిరెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, రామచంద్రయ్య, అశోక్ రెడ్డి, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

### నిర్దేశిత ప్రదేశాల్లోనే పార్కింగ్ చేయాలి



ట్రాఫిక్ పోలీసులకు హెల్మెట్లు అందిస్తున్న ఎస్పీ జగదీష్

**అనంతపురం:** నగరంలో నిర్దేశిత ప్రదేశాల్లోనే వాహనాలు పార్కింగ్ చేయాలని జిల్లా ఎస్పీ పి.జగదీష్ వాహనదారులకు సూచించారు. డిస్కవరీ అనంతపురం సహకారంతో ట్రాఫిక్ పోలీసులకు 40 హెల్మెట్లు, 14 రాంగ్ పార్కింగ్ వాహనాలకు వీల్ లాక్స్‌ను జిల్లా ఎస్పీ అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ డిస్కవరీ అనంతపురం నిర్వాహకుడు అనిల్‌ను అభినందించారు. ప్రజలకు అసౌకర్యం, వాహనాల రాకపోకలకు అడ్డంకులు కలిగిస్తే జరిమానా విధిస్తామన్నారు. రహదారులపై అడ్డదిడ్డంగా పార్క్ చేసిన వాహనాల కోసం కొత్తగా వెహికల్ వీల్ లాక్స్‌ను ఉపయోగిస్తామన్నారు. కార్యక్రమంలో అనంతపురం అర్బన్ డీఎస్పీ వి.శ్రీనివాసరావు, ట్రాఫిక్ సీఐ వెంకటేశ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తాం



మాట్లాడుతున్న డీఈఓ ప్రసాద్ బాబు

**గుత్తి:** ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి విద్యార్థుల సంఖ్యను పెంచడానికి చర్యలు తీసుకుంటున్నామని డీఈఓ ప్రసాద్ బాబు అన్నారు. గుత్తిలోని ఏపీ బాలికల గురుకుల పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. పీఎం శ్రీ కార్యక్రమంలో భాగంగా ఆయన పాఠశాలను సందర్శించి, మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో సదుపాయల పెంపు, భవనాల మరమ్మతులపై దృష్టి సారించామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పీఎం శ్రీ పాఠశాలల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### గెలుపోటములు సర్వ సాధారణం

**గుత్తి:** క్రీడల్లో గెలుపు, ఓటములు సర్వ సాధారణమని, గెలుపు ఓటములను సమానంగా భావించే వారే అసలైన విజేతలని ఏడీసీఏ( అనంతపురం డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్) సెక్రటరీ భీమలింగారెడ్డి, రైల్వే ఇన్‌స్టిట్యూట్ చైర్మన్ రసూల్ అన్నారు. గుత్తి ఆర్ఎస్‌లోని రైల్వే ఇన్‌స్టిట్యూట్ క్రీడామైదానంలో మంగళవారం ఆర్డీటీ ఆధ్వర్యంలో స్కూల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. వారు ముఖ్య అతిథులుగా హాజరై టోర్నీని ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. వారు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలన్నారు. గెలిచిన వారు అత్యుత్సాహాన్ని ప్రదర్శించకుండా, ఓడిన వారు కుంగి పోకుండా ఉండాలన్నారు. అనంతరం ఆర్డీటీ కోచ్ మహేష్ (మగ్గి) మాట్లాడుతూ స్కూల్ క్రికెట్ టోర్నమెంట్ ఆగస్టు 12 వరకూ కొనసాగుతుందన్నారు. మొత్తం 15 జట్లు పాల్గొన్నాయన్నారు. కార్యక్రమంలో న్యాయవాది నవీన్, సోల్మోన్ రాజు తదితరులు పాల్గొన్నారు.